క్లుప్తంగా

డైరీ ఆవిష్కరణ



తిరుపతి అలిపిరి: టీటీడీ ఆడిట్ విభాగం రూపొందించిన 2023 డైరీని ఈవో ధర్మారెడ్డి సోమవారం తిరుపతిలోని పరిపాలనా భవనంలో ఆవిష్కరించారు. ఇందులో ఉద్యోగులకు ఉపయోగపడేలా సమాచారాన్ని పొందుపరిచారు. ఆడిట్ విభాగం జేడీ రామచంద్రారెడ్డి, ఆడిట్ అధికారులు రామ్మూర్తి, లక్ష్మి, ప్రభావతి, ఏఏఓలు విశ్వనాథ్ రాయలు, రఘురాం, పూర్ణిమ, రామారావు పాల్గొన్నారు.

నగదు జమలో జాప్యం తగదు

భాకరాపేట: ప్రభుత్వ మద్యం దుకాణాల్లో పని చేసే సూపర్‌వైజర్లు బ్యాంకుల్లో నగదు జమ చేయడంలో జాప్యం తగదని చిత్తూరు మద్యం డిపో సబ్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణశాస్త్రి తెలిపారు. ఆయన సోమవారం చిన్నగొట్టిగల్లు, భాకరాపేట ప్రభుత్వ మద్యం దుకాణాలను తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ మద్యం అమ్మగా వచ్చిన నగదును బ్యాంకుల్లో జమ చేసే విషయంలో సూపర్‌వైజర్లు ఆలస్యం చేస్తున్నారని తెలిపారు. వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకోనున్నట్లు చెప్పారు. సిబ్బంది నాగరాజ, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

పోషకాహార లోపంతోనే రోగాలు

భాకరాపేట: పోషకాహార లోపంతోనే రోగాలు వస్తాయని, పోషకాహార లోపం ఉన్న పిల్లలు, రక్తహీనత ఉన్న స్త్రీలను గుర్తించాలని చిన్నగొట్టిగల్లు ఎంపీపీ యుగంధర్‌రెడ్డి కోరారు. ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం వెల్ఫేర్ అసిస్టెంట్లు, మహిళా పోలీసులు, ఏఎన్‌ఎంలకు పోషకాహార లోపం నివారణపై అవగాహన కల్పించారు. ఎంపీడీవో దేవేంద్రబాబు మాట్లాడుతూ పోషకాహార లోపం ఉన్న పిల్లలు, రక్తహీనత ఉన్న గర్భిణులు, డ్రాపౌట్‌ల సామాజిక, ఆర్థిక, ఆరోగ్య పరిస్థితులను మెరుగుపరిచేందుకు ప్రభుత్వం సర్వే చేపట్టిందన్నారు.

జీవన నైపుణ్యాలపై అవగాహన

తిరుచానూరు: కోదండరామస్వామి హైస్కూల్ విద్యార్థులకు సోమవారం పద్మావతి మహిళా వర్సిటీ మహిళా అధ్యయన కేంద్రం ఆధ్వర్యంలో జీవన నైపుణ్యాలపై అవగాహన కల్పించారు. అధ్యయన కేంద్రం రీడర్ కె.హైమావతి మాట్లాడుతూ నిజ జీవితంలో ఎదురయ్యే సవాళ్లు, సమస్యలను అధిగమించడానికి జీవన నైపుణ్యాలు ఎంతగానో తోడ్పడతాయన్నారు. సరైన సమయంలో సరైన నిర్ణయాలు తీసుకోవడం, సత్సంబంధాలు కొనసాగించడంలో వీటి పాత్ర కీలకమన్నారు. హెచ్‌ఎం సురేంద్రబాబు, రెడ్డి నాయక్, సుబ్రమణ్యం, రీసెర్చ్ అసిస్టెంట్ వి.ప్రీతి పాల్గొన్నారు.

ముగిసిన యువ ధార్మికోత్సవం

తిరుమల: ఆస్థాన మండపంలో దాస సాహిత్య ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో చేపట్టిన యువ ధార్మికోత్సవం సోమవారం ముగిసింది. బెంగళూరుకు చెందిన ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త రాఘవేంద్రాచార్యులు మాట్లాడుతూ చిన్నతనం నుంచి ఆధ్యాత్మికత, దైవభక్తి కలిగి ఉత్తమ పౌరులుగా ఎదగాలన్నారు. పిల్లలకు తల్లిదండ్రులు కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకొని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్నారు. దాస హిత్య ప్రాజెక్ట్ ప్రత్యేక అధికారి ఆనంద తీర్థాచార్యులు, ఆంధ్ర, తెలంగాణ, కర్ణాటక నుంచి వచ్చిన 1600 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

ఏబీవీపీ జిల్లా విద్యార్థి సమ్మేళనం

తిరుచానూరు: అల్లూరి సీతారామరాజు జయంతి ఉత్సవాల్లో భాగంగా సోమవారం ఎస్వీయూలో ఏబీవీపీ జిల్లా విద్యార్థి సమ్మేళనం నిర్వహించారు. ఏబీవీపీ జాతీయ కార్యదర్శి నాగోతు హరికృష్ణ మాట్లాడుతూ ఏబీవీపీ విద్యార్థుల సమస్యలపై పోరాటాలు చేస్తున్నట్టు పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న వర్సిటీల్లో టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టులు భర్తీ చేయకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఉపాధ్యక్షుడు వెంకటరమణయ్య, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి స్వామి, రాష్ట్ర కార్య సమితి సభ్యురాలు గాయత్రి, జిల్లా ప్రముఖ్ సోమశేఖర్, నగర అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, నగర కార్యదర్శి పవన్ పాల్గొన్నారు.

చోరీ కేసులో నిందితుడికి జైలు

తిరుపతి లీగల్: బైక్ చోరీ కేసులో తిరుపతికి చెందిన శెట్టిపల్లి దిలీప్‌కు 63 రోజుల జైలు శిక్ష, రూ.100 జరిమానా విధిస్తూ తిరుపతి రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి పల్లపోలు కోటేశ్వరరావు సోమవారం తీర్పు చెప్పారు. నిందితుడు దిలీప్ గత ఏడాది మరొకరితో కలిసి తిరుపతి ఈస్టు పోలీసు స్టేషన్ పరిధిలో బైక్ చోరీ చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఈస్టు పోలీసులు కేసు దర్యాప్తుచేసి నిందితుడు దిలీప్, పవన్‌కుమార్‌ను కోర్టులో హాజరుపరిచారు. కేసు విచారణ దశలో పవన్‌కుమార్ మృతి చెందాడు. నిందితుడు దిలీప్ సోమవారం నేరం అంగీకరించడంతో శిక్ష విధించారు.

ప్రజా ఫిర్యాదులకు సత్వర పరిష్కారం

తిరుపతి తుడా: స్పందనలో ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అనుపమ అంజలి హెచ్చరించారు. ఆమె సోమవారం డిప్యూటీ మేయర్ ముద్ర నారాయణతో కలిసి డయల్ యువర్ కమిషనర్, స్పందన కార్యక్రమాలు నిర్వహించారు. ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. అనంతరం అధికారులతో సమీక్షించారు. ఆమె మాట్లాడుతూ ప్రతి సోమవారమూ వార్డు సచివాలయాల్లో స్పందన నిర్వహించాలన్నారు. సచివాలయ సెక్రటరీలు తప్పనిసరిగా అందుబాటులో ఉండాలన్నారు. ప్రజల నుంచి వచ్చే ప్రతి ఫిర్యాదును ఆన్‌లైన్లో నమోదు చేయడంతోపాటు పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. లేనిపక్షంలో శాఖాపరమైన చర్యలు తప్పవన్నారు. అదనపు కమిషనర్ సునీత, ఎస్ఈ మోహన్, ఎంఈ వెంకట్రామిరెడ్డి, రెవెన్యూ అధికారులు సేతుమాధవ్, కె.ఎల్.వర్మ, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ హరికృష్ణ, అసిస్టెంట్ సిటీ ప్లానర్లు బాలసుబ్రహ్మణ్యం, షణ్ముగం, మేనేజర్ చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.



ఫిర్యాదులను స్వీకరిస్తున్న కమిషనర్ అనుపమ అంజలి

పక్కా ప్రణాళికతో మాస్టర్ ప్లాన్ రోడ్ల పనులు

మాస్టర్ ప్లాన్ రోడ్ల పనులను పక్కా ప్రణాళికతో చేపట్టినట్టు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అనుపమ అంజలి తెలిపారు. ఆమె సోమవారం ఇంజినీరింగ్, టౌన్ ప్లానింగ్ అధికారులతో కలిసి మాస్టర్ ప్లాన్ రోడ్ల పనుల పురోగతిని పరిశీలించారు. కమిషనర్ మాట్లాడుతూ నగరంలోని ప్రజలు ఎదుర్కొంటున్న ట్రాఫిక్ సమస్య పరిష్కారం, నగర విస్తరణతోపాటు కనెక్టివిటీ పెంచడమే లక్ష్యంగా రోడ్లు ఏర్పాటుచేస్తున్నట్టు వివరించారు. రోడ్ల మధ్యలో ఉన్న విద్యుత్ స్తంభాలను వెంటనే తొలగించాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న టీడీఆర్ బాండ్లను వెంటనే అందజేయాలని టౌన్ ప్లానింగ్ అధికారులకు సూచించారు. అదనపు కమిషనర్ సునీత, ఎస్ఈ మోహన్, డీఈ సంజీవకుమార్, ఏసీపీ బాల సుబ్రమణ్యం, సర్వేయర్లు దేవేంద్ర, మురళీకృష్ణ పాల్గొన్నారు.

రూ.5.75 కోట్లతో పెరుమాళ్లపల్లెలో అభివృద్ధి పనులు

- ఎంపీపీ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి

తిరుపతి రూరల్: పెరుమాళ్లపల్లి పంచాయతీలో రూ.5.75 కోట్లతో పలు అభివృద్ధి పనులు చేపట్టామని తిరుపతి రూరల్ ఎంపీపీ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి తెలిపారు. ఆయన సోమవారం పెరుమాళ్లపల్లి పంచాయతీలో గడప గడపకూ మహా పాదయాత్ర చేపట్టారు. ఆయనకు వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మునీశ్వర్ రెడ్డి, డివిజన్ అధ్యక్షుడు గుణశేఖర్ రెడ్డి, సర్పంచ్ జోగి మోహన్ ఘన స్వాగతం పలికారు. ఇంటింటికీ వెళ్లి మూడున్నరేళ్లలో వారు ప్రభుత్వం నుంచి పొందిన లబ్ధిని వివరించారు. ప్రాథమిక పాఠశాలను సందర్శించి విద్యార్థులతో ముచ్చటించారు. రూ.20 లక్షలతో కాలువ నిర్మాణానికి భూమిపూజ చేశారు. మరో రూ.1.50 కోట్లతో పనులకు ప్రణాళికలు రూపొందించినట్టు వెల్లడించారు. ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అర్హులందరికీ నవరత్నాల పథకాలు అందించి పేదల గుండెల్లో చెరగని ముద్ర వేసుకున్నారని తెలిపారు. పల్లెలను ప్రగతి బాట పట్టించి, ప్రజల మెరుగైన జీవన విధానానికి మౌలిక వసతులు కల్పించిన ఘనత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి దక్కుతుందన్నారు. వైస్ ఎంపీపీ మాధవ రెడ్డి, నాయకులు బొందు భాస్కర్ రెడ్డి, గౌతమి రెడ్డి, ఉపసర్పంచ్ వెంకటనారాయణరెడ్డి, లోకనాథం, భానుకుమర్ రెడ్డి, మాజీ సర్పంచ్ చాట్ల రవి, రాజు, చాట్ల భాను, లోకనాథ్ పాల్గొన్నారు.



వృద్ధురాలితో మాట్లాడుతున్న ఎంపీపీ మోహిత్ రెడ్డి

పేదలకు అల్పాహారం వితరణ



తిరుపతి కల్చరల్: లయన్స్ క్లబ్ ఆఫ్ తిరుపతి స్మార్ట్ సిటీ సేవా కార్యక్రమంలో భాగంగా వెంకటశివ ఫుట్ వేర్ అధినేత రాటకొండ బాబు నాయుడు సోమవారం ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రి వద్ద 450 మందికి అల్పాహారం అందజేశారు. లయన్స్ క్లబ్ కోఆర్డినేటర్ రామచంద్రారెడ్డి, కార్యదర్శి వికాస్, కోశాధికారి వనాద్రి, ఈశ్వరయ్య, పద్మనాభం, శీను పాల్గొన్నారు.

టీటీడీ ఉద్యోగికి రిమాండ్

తిరుపతి లీగల్ : గత నెల 26న అమ్మవారి ఊరేగింపులో విధి నిర్వహణలోని పోలీసు కానిస్టేబుల్ శేషాద్రిపై దాడి చేసిన కేసులో తిరుచానూరు పద్మావతి అమ్మవారి ఆలయ ఆర్జితం ఇన్‌స్పెక్టర్ దామోదరానికి 20 వరకు రిమాండ్ విధిస్తూ తిరుపతి ఐదో అదనపు జూనియర్ సివిల్ జడ్జి సరిత సోమవారం ఆదేశాలు జారీ చేశారు. బాధితుడు శేషాద్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

59 మందికి జరిమానా

తిరుపతిలో మద్యంతాగి వాహనాలు నడపడం, ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించడం వంటి నేరాలకు పాల్పడిన 59 మందికి రూ.79,640 జరిమానా విధిస్తూ తిరుపతి మొదటి ప్రత్యేక కోర్టు మెజిస్ట్రేట్ సుబ్బలక్ష్మి తీర్పు చెప్పారు. నిందితులను ట్రాఫిక్, ఎస్వీయూ, ఈస్టు పోలీసులు కోర్టులో హాజరుపరిచారు.

ఇంటికి రూ.5 లక్షలు ఇవ్వాలి

తిరుపతి అర్బన్: రాష్ట్ర వ్యాప్తంగా 30 లక్షల మంది పేదలకు ఇళ్ల పట్టాలు మంజూరు చేయడం అభినందనీయమని, వారు ఇళ్లు నిర్మించుకునేందుకు ఇంటికి రూ.5 లక్షలు ఇస్తే ఇంకా బాగుంటుందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ తెలిపారు. జిల్లా కలెక్టరేట్ వద్ద సోమవారం సీపీఐ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఆయన మాట్లాడుతూ ఇంటి నిర్మాణానికి ఇసుక, సిమెంట్ ఉచితంగా ఇవ్వాలన్నారు. అలాగే రూ.5 లక్షలు ఇవ్వాలన్నారు. ఈ అంశంపై ఈ నెల 22న చలో విజయవాడ కార్యక్రమం చేపట్టనున్నట్టు తెలిపారు. అనంతరం డిప్యూటీ కలెక్టర్ భాస్కర్‌నాయుడుకు వినతి పత్రాలు అందజేశారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పి.హరినాథ్ రెడ్డి, సీపీఐ మహిళా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షురాలు జయలక్ష్మి, జిల్లా కార్యదర్శి మురళి, జిల్లా కార్యవర్గ సభ్యులు ప్రభాకర్, చిన్నం పెంచలయ్య, సుధాకర్ రెడ్డి, విశ్వనాథ్, రాధాకృష్ణ, కుమార్‌రెడ్డి, గురవయ్య, బాలకృష్ణ, చిన్నిరాజ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

తిరుమల శ్రీవారి సేవలో ప్రముఖులు

తిరుమల: శ్రీవారిని సోమవారం రాష్ట్ర మంత్రి బొత్స సత్యనారాయణ, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్యేలు పొన్నాడ వెంకటసతీష్ కుమార్, అవంతి శ్రీనివాస్, సినీ డైరెక్టర్ మల్లినేని గోపీచంద్ దర్శించుకున్నారు. వారికి అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి రంగనాయకుల మండపంలో లడ్డూ ప్రసాదాలతో సత్కరించారు.



మంత్రి బొత్స సత్యనారాయణ, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి

ఆర్సీపురం పోలీస్ స్టేషన్ తనిఖీ

రామచంద్రాపురం: తిరుపతి జిల్లా ఎస్పీ పరమేశ్వర్ రెడ్డి సోమవారం స్థానిక పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ బ్లూకోర్ట్ వాహనాలతో రాయలచెరువుకట్టపై పెట్రోలింగ్ నిర్వహించనున్నట్లు చెప్పారు. డీఎస్పీ నరసప్ప, సీఐలు చంద్రశేఖర్ పిళ్లై, ఓబులేశు, ఎస్ఐ గిరిబాబు పాల్గొన్నారు.



రికార్డులను పరిశీలిస్తున్న ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి

పంచాయతీలకు ఆటోల అందజేత

చంద్రగిరి: ప్రతి గ్రామమూ పరిశుభ్రంగా ఉండేలా చూడాలని ఎంపీపీ హేమేంద్ర కుమార్ రెడ్డి సూచించారు. తుడా చైర్మన్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి మండలంలోని 22 పంచాయతీల్లో చెత్త సేకరణకు సుమారు రూ.71.28 లక్షలతో 22 ఆటోలు మంజూరు చేశారు. వాటిని ఎంపీపీ సోమవారం పంచాయతీలకు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ ఆటోల ద్వారా గ్రామాల్లో తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించాలన్నారు. ఆటోలను సద్వినియోగం చేసుకుని గ్రామాలు పరిశుభ్రంగా ఉండేలా చూడాలని కోరారు. ఎంపీడీవో రమేషబాబు, ఏఓ రవిచంద్ర, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కొటాల చంద్రశేఖర్ రెడ్డి, డివిజన్ అధ్యక్షుడు కుప్పిరెడ్డి భాస్కర్ రెడ్డి, దేవారెడ్డి, బోస్ చంద్రారెడ్డి, పసల నాగరాజు, నరసింగాపురం సింగిల్ విండో చైర్మన్ మల్లం చంద్రమౌళిరెడ్డి పాల్గొన్నారు.

తిరుపతి అలిపిరి : తుడా నిధులతో మంజూరు చేసిన ఈ ఆటోలను సోమవారం ఎర్రావారిపాళెం మండలంలోని 12 గ్రామ పంచాయతీలకు అందజేశారు. ఎంపీపీ శివలక్ష్మి, జెడ్పీటీసీ కరుణాకర్ రెడ్డి, ప్రత్యేక ఆహ్వానితులు చెంగల్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ దేపట్ల నాగార్జున రెడ్డి, ఎంపీడీవో అమర్నాథ్ పాల్గొన్నారు.



చంద్రగిరి : ఆటోలను ప్రారంభిస్తున్న ఎంపీపీ హేమేంద్ర కుమార్ రెడ్డి

కళాకారుల సమస్యలు పరిష్కరించాలి

తిరుపతి కల్చరల్: జానపద వృత్తి కళాకారుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎ.జగన్మోహన్‌రావు, బంగారు మురళి టీటీడీని డిమాండ్ చేశారు. వారు సోమవారం యశోదానగర్‌లోని ఎంబీ భవన్‌లో విలేకరులతో మాట్లాడారు. అఖండ హరినామ సంకీర్తనా వేదికపై భజనలను మాత్రమే టీటీడీ ఈవో ధర్మారెడ్డి ప్రారంభించారని, మిగిలిన సమస్యలను పట్టించుకోలేదన్నారు. టీటీడీ అనుబంధ ఆలయాల్లో జరిగే ఉత్సవాల్లో ప్రదర్శనలకు కోలాటం, చెక్కభజన, పండరి భజన, కీలుగుర్రాలు, పిల్లనగ్రోవులు, కావడిమేళం, డ్రమ్స్, పలకలు తదితర కళాకారులకు అవకాశం కల్పించాలని కోరారు. జానపద వృత్తి కళాకారుల సంఘం రాష్ట్ర నేతలు వెంకటరమణ, నాగరాజు, కోటేశ్వరరావు, ఎస్‌కే.మహ్మద్ హర్షద్, దేవానంద్ పాల్గొన్నారు.

విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణానికి స్థల పరిశీలన

తిరుపతి రూరల్: సీగొల్లపల్లిలో రూ.2 కోట్లతో విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ఏర్పాటు చేయనున్నారు. ఈ మేరకు వైస్ ఎంపీపీ విడుదల మాధవరెడ్డి, సర్పంచ్ రవి, ఎస్పీడీసీఎల్ చంద్రగిరి డివిజన్ డీఈ శేషాద్రిరెడ్డి, ఏఈ రజనీకుమార్ సోమవారం స్థలాన్ని పరిశీలించారు. సబ్‌స్టేషన్ నిర్మాణానికి ఎకరా స్థలం అప్పగించేందుకు పంచాయతీ అధికారులు తీర్మానం చేశారు. వైస్ ఎంపీపీ మాధవరెడ్డి మాట్లాడుతూ తిరుపతి రూరల్ మండలంలో నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేసేందుకు ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి ఆదేశాల మేరకు రూ.2 కోట్లు మంజూరయ్యాయని, సబ్ స్టేషన్‌కు అవసరమైన స్థలాన్ని అధికారులకు అప్పగించామన్నారు.



స్థలాన్ని పరిశీలిస్తున్న వైస్ ఎంపీపీ మాధవరెడ్డి, డీఈ శేషాద్రిరెడ్డి, అధికారులు

సంక్షేమ పథకాలతో పేదలకు భరోసా



వృద్ధురాలిని ఆప్యాయంగా పలుకరిస్తున్న డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి

- డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి

తిరుపతి మంగళం: సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అమలుచేస్తున్న సంక్షేమ పథకాలు పేదల జీవితాలకు భరోసా కల్పిస్తున్నాయని డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి తెలిపారు. ఆయన సోమవారం కార్పొరేటర్ కల్పనయాదవ్, వైఎస్సార్ సీపీ డివిజన్ అధ్యక్షుడు ఇమ్రాన్ బాషతో కలిసి 30వ డివిజన్ నెహ్రూనగర్‌లో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ప్రతి గడపకూ వెళ్లి సంక్షేమ పథకాలను వివరించారు. ఆయన మాట్లాడుతూ జగనన్న అమలుచేస్తున్న పథకాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని తెలిపారు. వివిధ పథకాలతో ప్రతి ఇంటికీ సుమారు రూ.10 లక్షల వరకు లబ్ధి కలుగుతోందని పేర్కొన్నారు. అందుకే ఏ గడపకు వెళ్లినా ప్రజలు నీరాజనం పలుకుతున్నారని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో ఓటు వేసి జగనన్నను ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు రామస్వామి వెంకటేశ్వర్లు, తిరుత్తణి శైలజ, నరసింహాచారి. ఆదిలక్ష్మి, గంగమ్మ ఆలయ చైర్మన్ కట్టా గోపీయాదవ్, పార్టీ నాయకులు రవిశంకర్, షర్మిల, శీను, కోదండ తదితరులు పాల్గొన్నారు.

అటవీ భూమిలో శ్మశానం మాకొద్దు

తిరుపతి మంగళం: అటవీ భూమిలో శ్మశానం వద్దని తిరుపతి 50వ డివిజన్ కార్పొరేటర్ బోకం అనీల్‌కుమార్, వైఎస్సార్ సీపీ డివిజన్ అధ్యక్షుడు కుప్పయ్య, తిమ్మినాయుడుపాళెం హరిజనవాడ వాసులు తెలిపారు. వారు సోమవారం తిరుపతి డివిజనల్ ఫారెస్ట్ అధికారి సతీష్‌కుమార్‌రెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ తాతల కాలం నుంచి తిమ్మినాయుడుపాళెం పాత హరిజనవాడ వద్ద ఉన్న శ్మశానంలో కర్మక్రియలు జరుపుకుంటున్నామని తెలిపారు. ఆ స్థలాన్ని తమ గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు వెంకటరత్నం కబ్జా చేసి అక్రమ నిర్మాణాలు చేపట్టారని పేర్కొన్నారు. ఇప్పుడు అటవీ భూమిని శ్మశానానికి ఇవ్వాలని గ్రామంలోని కొందరిని రెచ్చగొడుతున్నాడని ఆరోపించారు. శ్మశానంలోని నిర్మాణాలను తొలగించాలని కలెక్టర్‌తో పాటు రెవెన్యూ అధికారులకు వినతి పత్రాలు అందజేశామని వివరించారు. శ్మశానం పేరుతో అటవీ భూమిలో ఆక్రమణలకు పాల్పడాలని చూస్తున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని కార్పొరేటర్ అనీల్‌కుమార్, కుప్పయ్య, బొజ్జయ్య, మణి, పార్థసారథి, యువరాజ్ కోరారు.



అటవీ అధికారికి వినతిపత్రం అందజేస్తున్న అనీల్‌కుమార్, కుప్పయ్య, గ్రామస్తులు

కలిచేడు, తలుపూరు పాఠశాలల అభివృద్ధికి చర్యలు

తిరుపతి మంగళం: వెంకటగిరి నియోజకవర్గం సైదాపురం మండలం తలుపూరు (ఎంఎంఎల్‌డబ్ల్యూవో) పాఠశాలల అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని కేంద్ర ప్రభుత్వం తెలిపారు. పాఠశాలల దుస్థితిపై తిరుపతి ఎంపీ గురుమూర్తి గత ఏడాది పార్లమెంట్ సమావేశాల్లో ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. ఈ క్రమంలో కేంద్రం సోమవారం సమాధానం ఇచ్చింది. పాఠశాలల్లో అధ్యాపకుల భర్తీ, మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకుంటామని పేర్కొంది. ఇందులో భాగంగా కలిచేడు, తలుపూరు గ్రామాల్లోని పాఠశాలల భవనాలను పరిశీలించి నివేదిక అందజేయాలని తిరుపతిలోని సీపీడబ్ల్యూడీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌ను హైదరాబాద్‌లోని వెల్ఫేర్ కమిషనర్ ఆదేశించారు. సెంట్రల్ పబ్లిక్ వర్క్స్ డిపార్ట్‌మెంట్ నుంచి ప్రతిపాదనలు అందిన వెంటనే బడ్జెట్ కేటాయిస్తారని ఎంపీ గురుమూర్తి తెలిపారు.







